# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-03-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్‌లో ‘క్వాంటమ్ వ్యాలీ’ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

**2. తెలంగాణ వ్యవసాయ శాఖ అనుబంధ కార్పొరేషన్లను ఒకే పరిధిలోకి తీసుకురావాలని అధికారులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.**

**3. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం కోసం ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి తీసుకొనే రుణాలు రాష్ట్ర అప్పుల పరిమితిలోకి రావని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.**

**4. అమరావతి ప్రాంతంలో భూములు తీసుకున్న సంస్థలు నిర్దేశిత సమయంలో ఆయా నిర్మాణాలు పూర్తి చేయాలని మంత్రి వర్గ ఉప సంఘం వెల్లడించింది.**

**5. తెలంగాణా రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి.**

**==========================**

నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ స్థాయిలో క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్ ‘క్వాంటమ్ వ్యాలీ’ని రూపొందించేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి ప్రణాళిక రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సచివాలయంలో నిన్న ఆయన పారిశ్రామిక వేత్తలు, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగ నిపుణులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈ సమావేశ వివరాలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఐఐటీ మద్రాస్, టీసీఎస్, ఐబీఎం సహకారంతో క్వాంటమ్ కంప్యూటింగ్ పరిశోధనకు ఆంధ్రప్రదేశ్.. జాతీయ కేంద్రంగా మారడానికి, ప్రతిభావంతులను, పెట్టుబడులను ఆకర్షించడానికి ఈ హబ్ సహాయపడుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

--------------------------

అమరావతిలో త్వరలోనే క్యాన్సర్ ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నామని, అందుకోసం ఇప్పటికే భూమి కేటాయించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు రచించిన ‘మంటాడ టు మ్యాన్‌హ్యాటన్’ పుస్తకాన్ని విజయవాడలో నిన్న ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. నోరి ఫౌండేషన్ ద్వారా దత్తాత్రేయ

ప్రజలకు సేవ చేస్తున్నారని చెప్పారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి సరైన వైద్యం అందిస్తే ప్రాణాపాయం ఉండదని చంద్రబాబునాయుడు తెలియజేస్తూ...

..వాయిస్..

---------------------------

తెలంగాణ వ్యవసాయ శాఖ అనుబంధ కార్పొరేషన్లను ఒకే పరిధిలోకి కిందికి తీసుకురావాలని అధికారులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఆయా కార్పొరేషన్ల కార్యకలాపాలు, ఆర్థిక స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సచివాలయంలో నిన్న నిర్వహించిన కార్పొరేషన్ల సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యాలు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కార్పొరేషన్ల పనితీరు మెరుగుపడాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం కోసం ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి తీసుకొనే రుణాలు రాష్ట్ర అప్పుల పరిమితిలోకి రావని కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్‌చౌదరి వెల్లడించారు. ఈ రుణాలను ఆంధ్రప్రదేశ్ అప్పుల పరిమితిలో లెక్కించకూడదని నిర్ణయించామని స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలో అత్యవసర మౌలిక వసతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సాయం కింద ఆంధ్రప్రదేశ్‌కు 2 వేల 500 కోట్ల రూపాయలు ఇచ్చిందని పంకజ్ చౌదరి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్షల్లో భాగంగా ఈరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫిజిక్స్-పేపర్ 1, ఎకనామిక్స్ పేపర్-1 పరీక్షలు జరుగుతాయి.

---------------------------

విశాఖపట్నం నౌకాశ్రయానికి భారీ నౌకలు రాకపోకలు సాగించేందుకు వీలుగా 18 మీటర్ల డ్రాఫ్ట్ తవ్వేందుకు సబ్సిడీలు మంజూరుచేయాలని పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నిన్న ఆయన లోక్‌సభలో లాడింగ్ బిల్లు 2024పై జరిగిన చర్చలో మాట్లాడుతూ.. దేశంలోని అన్ని ప్రధాన పోర్టుల్లో డ్రాఫ్ట్ 14 నుంచి 16 మీటర్ల వరకే ఉందని, దీన్ని 18 మీటర్లకు విస్తరించడానికి వీలుగా డ్రెడ్జింగ్ చేయడానికి కేంద్రం ఆర్థికసాయం చేయాలని విజ్ఞప్తిచేశారు. విశాఖపట్నంలో క్రూయిజ్ పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా ఈ-వీసా సౌకర్యం ప్రవేశపెట్టాలని ఎంపీ శ్రీభరత్ కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలో భూములు తీసుకున్న సంస్థలు నిర్దేశిత సమయంలో ఆయా నిర్మాణాలు పూర్తి చేయాలని మంత్రులు పి.నారాయణ, పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. రాజధానిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం నిన్నసచివాలయంలో సమావేశమైంది. ఈ సందర్భంగా పలు సంస్థలకు భూ కేటాయింపులపై చర్చించి తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పాత్రికేయులకు

తెలిపారు. గతంలో 131 సంస్థలకు భూములు కేటాయించగా.. అందులో 31 యథాతథంగా ఆమోదించామని తెలిపారు. 48 వేల కోట్ల రూపాయల నిర్మాణ పనులకు టెండర్లు పిలిచామని.. రెండు రోజుల్లో ఒప్పందాలు చేసుకుని పనులు ప్రారంభిస్తారని మంత్రి నారాయణ వివరిస్తూ..

.. వాయిస్..

---------------------------

భారత్‌ను అంతర్జాతీయ వినోద రంగానికి కేంద్రంగా మార్చేందుకు, వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్ టెయిన్ మెంట్–వేవ్స్ 2025 సదస్సును ముంబైలోని జియో వరల్డ్ గార్డెన్స్‌లో మే 1 నుంచి 4వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. దేశంలో మీడియా–వినోదరంగం అభివృద్ధి, వాణిజ్యపరమైన అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సృజనాత్మక, ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో. “క్రియేట్ ఇన్ ఇండియా” పేరుతో 31 అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు.

..ప్రోమో...

---------------------------

తెలంగాణా రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. సభ నిర్వహణ ఏర్పాట్లపై శాసన సభాపతి జి.ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నిన్న అధికారులతో సమీక్షించారు. శాసనసభ సమావేశాల హుందాతనాన్ని పెంపొందించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బడ్జెట్ సమావేశాలు ఎక్కువ రోజులు జరుగుతాయని.. సభలో సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందజేయాలని వారు అధికారులకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాలి మండలం భావనపాడులో ఫిషింగ్ హార్బర్, వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట, గారమండలం కళింగపట్నంలో ఫిషింగ్ జెట్టీలు నిర్మించాలని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు.. కేంద్ర నౌకాయానశాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్‌ను కోరారు. ఈ మేరకు నిన్న ఆయన లేఖ రాశారు. 194 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న శ్రీకాకుళం జిల్లాలో 230కి పైగా మత్స్యకార గ్రామాలున్నాయని, స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల వారు దూరప్రాంతాలకు వలస వెళ్తున్నారని రామ్మోహన్ నాయుడు వివరించారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ మూడుచోట్ల ఫిషింగ్‌హార్బర్, జెట్టీలు నిర్మిస్తే స్థానికంగానే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.

---------------------------

మహిళలకు లైంగిక వేధింపులు, ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు 112కి ఫోన్ చేస్తే శక్తి టీం పావుగంటలో వారి ముందు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అనకాపల్లి

జిల్లా నక్కపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో నిన్న మహిళలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హోంశాఖ మంత్రి శక్తి టీంకు సంబంధించిన 39 బీట్ వాహనాలను, 11 డ్రోన్లను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ  అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో ఈ రోజు నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరుపతిలోని హరిశ్చంద్ర శ్మశానవాటికలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.  ఈ ఉదయం పదిన్నరకు తిరుపతి భవానీనగర్‌లోని ఆయన స్వగృహం నుంచి ప్రారంభమయ్యే అంతిమయాత్రలో ప్రజాప్రతినిధులు, తిరుమల తిరుపతి దేవస్థానం ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

=======================